ఆపన్నులకు అండా దండా


కిడ్నీ సమస్యతో బాధపడుతున్న కట్ట శ్రీనుకు ఆర్థిక సాయం చేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి

- పలువురిని ఆర్థికంగా ఆదుకుంటున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్
- ప్రజాదర్బార్‌తో సమస్యల పరిష్కారానికి అలుపెరుగని కృషి


పోలియోతో బాధపడుతున్న గుమ్మళ్ల రవిశంకర్‌కు ఆర్థిక సాయం చేస్తున్న ఎమ్మెల్యే

ప్రజా ప్రతినిధిగా అభివృద్ధికి నిరంతరం పాటు పడుతూ.. తన నియోజకవర్గంలోని ప్రజల కష్టాల పట్ల కూడా స్పందిస్తూ సాయమందిస్తున్నారు ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్. అదే విధంగా పలు ప్రాంతాల్లో ప్రజాదర్బార్ వంటి వినూత్న కార్యక్రమం నిర్వహిస్తూ స్వయంగా ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తూ వారి సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరిస్తున్నారు.

డాబాగార్డెన్స్ : ఆపదలో ఉన్న వారికి ఆత్మబంధువుగా నిలుస్తున్నారు ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్. ప్రజాదర్బార్ ద్వారా సమస్యలు పరిష్కరించడంతో పాటు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి.. అనారోగ్యంతో మంచం పట్టిన వారికి, ప్రమాదవశాత్తు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారికి నేనున్నానంటూ భరోసా కల్పిస్తూ ఆర్థిక సాయం చేస్తున్నారు. ఆసుపత్రి యాజమాన్యాలు, వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని అండగా నిలుస్తున్నారు. ఇప్పటి వరకు వందలాది మందికి తన సొంత నిధులతో ఆర్థిక సాయం అందించి ఆదుకున్నారు. తాజాగా గురువారం పలువురికి రూ. 30 వేలు ఆర్థిక సాయం అందజేశారు. 32వ వార్డు అల్లిపురం గాంధీబొమ్మ పిల్లావారివీధికి చెందిన గుమ్మళ్ల రవిశంకర్ గత కొన్నేళ్లుగా పోలియోతో బాధపడుతున్నట్టు తెలుసుకుని మందుల కొనుగోలుకు రూ.5 వేలు అందజేశారు. అల్లిపురం బంగారమ్మమెట్టకు చెందిన యల్లపు వీరన్న గత కొంత కాలంగా తలసేమియా వ్యాధితో బాధపడుతున్నారని ప్రజాదర్బార్‌లో తెలియజేసిన పిదప వారింటికి వెళ్లి రూ.5 వేలు అందజేశారు. 37వ వార్డు పెయిందొరపేటకు చెందిన మైలపిల్లి సావిత్రి క్యాన్సర్‌తో బాధపడుతున్నట్టు వైఎస్సార్ సీపీ వార్డు నాయకుల ద్వారా తెలుసుకుని మందుల ఖర్చులకు రూ.5 వేలు, 39వ వార్డు కన్వేయర్‌బెల్ట్ వద్ద నివసిస్తున్న వైఎస్సార్‌సీపీ సీనియర్ కార్యకర్త కె. చంద్రరావు తండ్రి అచ్చెన్న ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన సందర్భాన్ని పురస్కరించుకుని దశదిన కర్మ కోసం రూ. 5వేలు, 39వ వార్డు సీహార్స్ జంక్షన్ రామకృష్ణావీధికి చెందిన కట్టశ్రీను కిడ్నీ సమస్యతో బాధపడుతున్న దృష్ట్యా మందుల ఖర్చుల కోసం రూ. 5వేలు అందజేశారు. 38వ వార్డు శివాలయం వీధికి చెందిన గుర్రాల శేఖర్ తండ్రి రాజారావు ఇటీవల మృతి చెందిన దృష్ట్యా పెద్ద కర్మ కోసం రూ.5 వేలు సాయం చేశారు. కార్యక్రమంలో కనమహాలక్ష్మి దేవస్థానం చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, పార్టీ నాయకులు మూలే రామిరెడ్డి, నొల్లు పోతుస్వామి, ప్రసాదరావు, పచ్చిరపల్లి రాము, ముజీబ్‌ఖాన్, బోని దేవా, ఆదివిష్ణు, సుబ్రహ్మణ్యం, వెంకటరత్నం, సురపతి అప్పన్న, బాబుల్ శ్రీను, కోటి, మీసాల అశోక్‌కుమార్, కాసారపు వాసు, వెంకటలక్ష్మి, రామరాజు, రోజా ఆదిలక్ష్మి, శ్రావణ్, రమణమ్మ, కమలుద్దీన్, తిత్తి కృష్ణ, మాధురి, ఇబ్రహీం, చింతకాయల వాసు, అచ్యుత్, ధనరాజు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఘనంగా సహస్ర తులసి పూజ


సహస్ర తులసి పూజలో సిరులతల్లి

డాబాగార్డెన్స్ : కనకమహాలక్ష్మి ఆలయంలో గురువారం ఘనంగా సహస్ర తులసిపూజ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, పలువురు ధర్మకర్తలు, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, పర్యవేక్షకుడు ముద్దాడ రమణ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

వివేకానంద సంస్థలో భగత్‌సింగ్ జయంతి


మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న డాక్టర్ జహీర్ అహ్మద్

డాబాగార్డెన్స్ : స్వాతంత్య్ర సమరయోధుడు భగత్‌సింగ్ 116వ జయంతి గురువారం పాతనగరంలోని స్వామి వివేకానంద సంస్థలో నిర్వహించారు. సంస్థ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ సీఎంఏ జహీర్ అహ్మద్, రౌండ్ టేబుల్ సంస్థ ప్రతినిధి మక్సూద్ అహ్మద్ పాల్గొని ముందుగా భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ జహీర్ అహ్మద్ మాట్లాడుతూ బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా పోరాడి, అతి చిన్న వయస్సులోనే ఉరి తీయబడ్డారని చెప్పారు. భారతదేశ స్వాతంత్య్రం కోసం ప్రాణాలు అర్పించిన గొప్ప సమరయోధుడని కొనియాడారు. అనంతరం వృద్ధులు, మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు, మహిళా సభ్యులు పాల్గొన్నారు.

మహిళా కళాశాలకు 8 కంప్యూటర్ల అందజేత


కళాశాలకు కంప్యూటర్లు అందజేస్తున్న వాసవీ విద్యా విరాళ ప్రతినిధులు

డాబాగార్డెన్స్ : వాసవీ క్లబ్ విద్యా విరాళ పథకంలో భాగంగా 8 డెస్క్‌టాప్ కంప్యూటర్లను విశాఖ ప్రభుత్వ మహిళా కళాశాలకు అందజేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. శోభారాణి వాసవీ క్లబ్ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ అంతర్జాతీయ అధ్యక్షురాలు పి. గాయత్రి, వైజాగ్ వాసవీక్లబ్ ప్రెసిడెంట్ సతీష్, వాసవీ విద్యా విరాళం అధ్యక్షుడు దీపక్, కళాశాల ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ అరుణపద్మ, డాక్టర్ గీతాంజలి, వాసవీ క్లబ్ సభ్యులు, కళాశాల సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

స్వామినాథన్ మృతికి సిటు సంతాపం

డాబాగార్డెన్స్ : ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త, హరిత విప్లవ నాయకుడు స్వామినాథన్ మృతి రైతాంగంతో పాటు ప్రజానీకానికి కూడా తీవ్ర లోటని సిటు విశాఖ జిల్లా కమిటీ భావిస్తోందని ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన మృతికి సిటు సంతాపం తెలియజేస్తుందన్నారు. వ్యవసాయ రంగంలో అధికోత్పత్తి సాధించేందుకు నూతన వంగడాలను అభివృద్ధి చేయడంలో స్వామినాథన్ ఎంతో కృషి చేశారన్నారు. ప్రస్తుతం భారతదేశంలో రైతాంగం చేస్తున్న పోరాటంలో గిట్టుబాటు ధర అంశం కీలకమైనదని, అందుకు స్వామినాథన్ చేసిన సిఫారసులు ఎంతో కీలకమని గుర్తు చేశారు. ప్రపంచ దేశాల్లోని వివిధ యూనివర్శిటీల నుంచి 49 డాక్టరేట్లు పొందారని, స్వామినాథన్ మృతి రైతులు, కార్మికులకు తీరని లోటని పేర్కొన్నారు.

చిత్రకళా పోటీలకు విశేష స్పందన


చిత్రకళా పోటీల్లో పాల్గొన్న చిన్నారులు


చిన్నారులు వేసిన చిత్రాలు

డాబాగార్డెన్స్ : చోడవరం చిత్రకళా నిలయం ఆధ్వర్యంలో నిర్వహించిన 6వ అఖిలభారత చిల్డ్రన్ ఆర్ట్ పోటీలకు విశేష స్పందన లభించింది. ప్రేమసమాజం మినీ హాల్ వేదికగా గురువారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించిన చిత్రకళా పోటీల్లో వందలాది మంది విద్యార్థులు పాల్గొని వారిలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీశారు. ఈ సందర్భంగా చోడవరం చిత్రకళా నిలయం వ్యవస్థాపక కార్యదర్శి బొడ్డేటి సూర్యనారాయణ మాట్లాడుతూ గత ఆరేళ్లుగా చిత్రకళా పోటీలు నిర్వహిస్తూ ఎంతో మంది చిత్రకారులను సమాజానికి పరిచయం చేశామన్నారు. ఏడాదికోసారి ఇటువంటి పోటీలు నిర్వహిస్తూ పిల్లల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసి, సమాజానికి చిత్రకారులను అందిస్తున్నట్లు తెలిపారు. తన వద్ద శిక్షణ పొందిన అనేక మంది చిత్రకారులుగా.. డ్రాయింగ్ టీచర్లుగా రాణిస్తున్నారని చెప్పారు. ఈ పోటీలకు దేశం నలుమూలల నుంచి ఎంట్రీలు వచ్చాయన్నారు. పిల్లలకు నచ్చిన అంశాన్నే ఎంచుకుని డ్రాయింగ్ వేయించామన్నారు. పిల్లల్ని ప్రోత్సహించేందుకు పోటీలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి పార్టిసిపేషన్ సర్టిఫికెట్ అందజేయనున్నట్లు తెలిపారు. పోటీల విజేతలకు నవంబర్ 4న చోడవరంలో నిర్వహించనున్న ప్రత్యేక కార్యక్రమంలో బహుమతులు అందజేస్తామని చెప్పారు.

ఘనంగా మిలాద్ ఉన్ నబీ వేడుకలు


ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ తదితరులు

అల్లిపురం : ఈద్ ఏ మిలాద్ ఉన్ నబీని అల్లిపురంలో ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా 33వ వార్డులో శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లిం, మైనారిటీల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం తోడ్పడుతుందన్నారు. అనంతరం ముస్లింలు ఆయనను సత్కరించారు. కార్యక్రమంలో నీలమ్మ వేపచెట్టు అమ్మవారి దేవస్థానం చైర్‌పర్సన్ బొర్రా విజయలక్ష్మి, బొర్రా శ్రీనివాసరెడ్డి, ఎం.బాషా, అబ్దుల్ రెహ్మాన్, వైఎస్సార్‌సీపీ నాయకులు అజీజ్ ఖాన్, షేక్‌హసీనా, అబ్దుల్ సత్తార్, ఫరూఖ్, మదీనా బాషా, స్టేట్ కళింగ వైశ్య డైరెక్టర్ ప్రసాదరావు, ఆదివిష్ణు, సూర్య, బడుగు శ్రీనివాసరావు, కొల్లి సత్యవతి, మంగం పార్వతి, తాడి సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారిని దర్శించుకున్న సింహాచలం దేవస్థానం ఈవో


అమ్మవారి ప్రసాదం అందజేస్తున్న ఏఈవో తిరుమలేశ్వరరావు

డాబాగార్డెన్స్ : కనకమహాలక్ష్మి అమ్మవారిని వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం (సింహాచలం) కార్యనిర్వహణాధికారి ఎస్. శ్రీనివాసమూర్తి కుటుంబ సమేతంగా గురువారం దర్శించుకున్నారు. ఆలయ సాంప్రదాయం ప్రకారం స్వాగతం పలికి అమ్మవారికి విశేష పూజలు చేయించారు. వేద ఆశీర్వచనం అనంతరం అమ్మవారి ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, పర్యవేక్షకుడు ముద్దాడ రమణ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో దీపారాధన


దీపారాధనలో పాల్గొన్న మహిళలు

అల్లిపురం : నేరెళ్లకోనేరు జంక్షన్‌లో రైజింగ్ గైస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో గణేష్ ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. దీంట్లో భాగంగా గురువారం రాత్రి దీపారాధన కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. రంగు రంగుల పూలతో రంగవల్లులు తీర్చిదిద్ది, చుట్టూ దీపాలతో అలంకరించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వేడుకగా కుంకుమార్చన..


కుంకుమ పూజలో పాల్గొన్న మహిళలు

నేరెళ్లకోనేరు జంక్షన్‌లో గత 11 రోజులుగా ఘనంగా గణేష్ ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. దీంటో భాగంగా గురువారం రాత్రి మహిళలు వినాయక మండపంలో సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు చేపట్టారు.

అన్ని దానాల కన్నా.. అన్నదానం మిన్న


భక్తులకు అన్నప్రసాదం వడ్డిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్


అన్నప్రసాదం వడ్డిస్తున్న సీతంరాజు సుధాకర్ తదితరులు

అల్లిపురం : అన్ని దానాల కన్నా అన్నదానం మిన్న అని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ అన్నారు. గురువారం ఆయన 32వ వార్డులో జరుగుతున్న వినాయక ఉత్సవాల్లో పాల్గొన్నారు. ముందుగా ఆయన వినాయకుడికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు సాయి ప్రసాద్, గోపి, మండల అధ్యక్షుడు దొడ్డి బాపు ఆనంద్, బోర శ్రీనివాసరెడ్డి, పచ్చిరిపల్లి రాము, నగర బీసీ సెల్ అధ్యక్షుడు మన్యాల శ్రీను, రాష్ట్ర కళింగ వైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ ప్రసాదరావు, కణితి బ్రహ్మం, రామరాజు, వాసు పాల్గొన్నారు.

అన్నదాతలకు సీతంరాజు ప్రశంసలు

అన్నం పరబ్రహ్మ స్వరూపం అని, అటువంటి అన్న ప్రసాదాన్ని ప్రతి వారం భక్తులకు అందజేస్తున్న రేణుక ఎల్లమ్మ ఆలయ కమిటీ సేవలు ఎనలేనివని నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ నాయకులు సీతంరాజు సుధాకర్ అన్నారు. కెప్టెన్ రామారావు జంక్షన్‌లో గల రేణుక ఎల్లమ్మ అమ్మవారి ఆలయంలో గురువారం జరిగిన అన్నసమారాధన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. అంతకు ముందు ఆయన అమ్మవారికి విశేష పూజలు చేశారు. ఈ సందర్భంగా అన్నసమారాధనకు సహకరించిన ఆలయ కమిటీ సభ్యుడు రాజ్‌కిషోర్‌ను ఆయన సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ గౌరవాధ్యక్షుడు పీల వెంకట అప్పలనాయుడు, కమిటీ ప్రతినిధులు వాసుపల్లి నారాయణ, పంపాన గణేష్, బడే నాగరాజు, సత్యనారాయణ, పాకలపాటి అప్పారావు, వాసుపల్లి నర్సింగ్, తమ్మరపు మధు పాల్గొన్నారు.

35వ వార్డులో..

జీవీఎంసీ 35వ వార్డు జీవీఎంసీ కూరగాయల మార్కెట్, రామకృష్ణా జంక్షన్ ప్రాంతంలో శ్రీలక్ష్మీగణపతి చిల్లర వర్తక సంఘం ఆధ్వర్యంలో గణపతి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. దీంట్లో భాగంగా గురువారం నిర్వహించిన అన్నసమారాధన కార్యక్రమంలో ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో 35వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు అలపన కనకరెడ్డి, సంఘం ప్రతినిధులు నిమ్మ సూర్యనారాయణరెడ్డి, పట్నాల అసిరినాయుడు, పరపతి కనకరెడ్డి, మునకాల చిన్నారెడ్డి, నిమ్మ వెంకట రమణారెడ్డి, అగ్గరపు నాయుడు, గంధవరపు రాజు, గిరిసాల చిట్టిబాబు పాల్గొన్నారు.

ప్రసాద్‌గార్డెన్స్‌లో..

శ్రీ వరసిద్ధి వినాయక మహోత్సవాల్లో భాగంగా ప్రసాద్‌గార్డెన్స్ శ్రీ దుర్గా గణపతి ఐకాన్స్ ఆధ్వర్యంలో 52 వంటకాలతో 5 వేల మందికి మహా అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 35వ వార్డు అధ్యక్షుడు అలపన కనకరెడ్డి పాల్గొని ప్రారంభించారు. కార్యక్రమంలో బొందల చిన్న, దుర్గా ప్రసాద్, కనకరాజు, కమటీ సభ్యులు పాల్గొన్నారు.

అలరించిన సినీ సంగీత విభావరి


పాటలు పాడుతున్న గాయనీ గాయకులు

అల్లిపురం : సత్య సుమధుర స్వరాలు పదో వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో గురువారం సాయంత్రం నిర్వహించిన తెలుగు, హిందీ సినీ గీతాల సంగీత విభావరి అలరించింది. చాంద్ మేరా దిల్ మెగా మ్యూజికల్ పేరిట నిర్వహించిన ఈ కార్యక్రమంలో నగరానికి చెందిన గాయని సత్యవతి, పీబీ ఖాన్, కిరణ్‌కుమార్ నిర్వహణలో సమీర్, భాగ్యలక్ష్మి, కీర్తి, లావణ్య, రమేష్ పట్నాయక్, సబీనా, సబిహా, కల్యాణ్, రవీంద్ర తదితరులు హుషారైన తెలుగు, హిందీ గీతాలు ఆలపించి ప్రేక్షకులను మైమరిపించారు. కార్యక్రమంలో సోషల్ మీడియా స్టేట్ చైర్మన్ సన్‌మూర్తి, ప్రముఖ వ్యాఖ్యాత రాజేంద్రప్రసాద్, విశాఖ గాయనీ గాయక సాంస్కృతిక సంస్థ అధ్యక్షుడు భయ్యా శ్రీనివాస్, కార్యదర్శి డి.భూపతిరావు తదితర కార్యవర్గం ఆధ్వర్యంలో పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమానికి అతిథులుగా కిమ్స్ ఐకాన్ ఆస్పత్రి ఎండీ సతీష్‌కుమార్, రవీంద్ర, రవికిరణ్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

15 నుంచి దేవీ నవరాత్రి మహోత్సవాలు


అలంకరణలో షిర్డీ సాయిబాబా

సీతమ్మధార: నార్త్ ఎక్స్‌టెన్షన్‌లోని మహాగణపతి, ప్రసన్న వేంకటేశ్వర, అయ్యప్ప, షిర్డీసాయిబాబా దేవాలయంలో గురువారం ప్రధాన అర్చకుడు రాజాస్వామి బాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రత్యేక అలంకరణలో బాబా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా రాజాస్వామి మాట్లాడుతూ అక్టోబర్ 15 నుంచి 24 వరకు దేవీ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ప్రతి రోజు ఉదయం దుర్గా హోమం, మహాలక్ష్మీదుర్గమ్మవారికి అభిషేకాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతి రోజు ఉదయం 6 గంటలకు ప్రసన్న వేంకటేశ్వర స్వామికి ప్రత్యేక అభిషేకాలు, దేవీ నవరాత్రుల్లో ప్రతి రోజు అమ్మవారికి కుంకుమ పూజలు జరుగుతాయన్నారు. ప్రతి రోజు ఉదయం ఏడు గంటలకు వేంకటేశ్వరస్వామికి తిరువీధి, సాయంత్రం 6.30 నుంచి 8.30 గంటల వరకు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. ప్రతి రోజు మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం జరుగుతుందన్నారు. కుంకుమ పూజలో పాల్గొనే భక్తులు రూ.300 రుసుం చెల్లించి రసీదు పొందాలని రాజాస్వామి కోరారు.

వీనుల విందుగా అన్నమయ్య సంకీర్తనామృతం

సీతంపేట: శారదా స్వర సంగమం, అన్నమయ్య స్వర అకాడమీ సంయుక్తంగా గురువారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో నిర్వహించిన అన్నమయ్య సంకీర్తనామృతం ప్రేక్షకులను అలరించింది. గాయకులు, లెఫ్టినెంట్ లోకేష్ పర్యవేక్షణలో సుజన, ఉమాదేవిలు వారి శిష్య బృందంతో కలిసి అన్నమయ్య మధుర గీతాలను ఆలపించారు. లోకేశ్ పాడిన కలగంటి కలగంటి , బ్రహ్మమొక్కటే పరబ్రహ్మమొక్కటే, గోవింద గోవింద కీర్తనలు ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశాయి. కార్యక్రమంలో గాయనీ గాయకులను ఎస్.విజయ్‌కుమార్, చెన్నా తిరుమలరావు, భయ్యా శ్రీనివాస్, శారద, ఎం.ఎస్.మాధవ్ ప్రోత్సహించారు.

నవయుగ కవి జాషువాకు ఘన నివాళి


జాషువా విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ముఖ్య అతిథులు, నాయకులు, సంఘ సభ్యులు

కంచరపాలెం: నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. కంచరపాలెం జాషువానగర్‌లోని జాషువా కళా ప్రాంగణంలో ఆయన విగ్రహానికి సంఘ సభ్యుల ఆధ్వర్యంలో ముఖ్య అతిథులు పూర్వ వీసీ ఆచార్య జార్జ్ విక్టర్, అంబేడ్కర్ మిషన్ అధ్యక్షుడు బొడ్డు కల్యాణ్‌రావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జార్జ్ విక్టర్ మాట్లాడుతూ కుటిల కులతత్వం, మతోన్మాద దారిద్య్రంపై స్వానుభవం ఉన్న గుర్రం జాషువా వాటిని రూపుమాపేందుకు ఎంతో కృషి చేశారని కొనియాడారు. ఈ సందర్భంగా వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఎస్.అప్పారావు, టీడీపీ అధికార ప్రతినిధి ఈతలపాక సుజాత, యాదవ సంఘం ప్రతినిధి నమ్మి అప్పల సత్యనారాయణ, కళా ప్రాంగణం గౌరవ అధ్యక్షుడు గొటువాడ నర్సింగరావు, అధ్యక్షుడు అలమండ ప్రసాద్, కార్యదర్శి గుమ్మడి ఆదినారాయణమూర్తి, కోశాధికారి గుమ్మడి అచ్చిబాబు, జి.వి.రమణ, నాయకులు సోడదాసి సుధాకర్, ఎమ్మార్పీఎస్ నాయకుడు కణితి సాధురావు తదితరులు పాల్గొన్నారు.

మాస్టర్‌మైండ్స్ విద్యార్థులకు ఆలిండియా ర్యాంకులు



ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ తదితరులు

అల్లిపురం : ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఎంఏఐ) ఈ నెల 26న ప్రకటించిన సీఎంఏ ఇంటర్ ఫలితాల్లో మాస్టర్‌మైండ్స్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. లక్కిమ్‌శెట్టి వాగ్దేవి ఆల్ ఇండియా మొదటి ర్యాంకు, సీఎంఏ ఫైనల్ ఫలితాల్లో కదంబల అమృత ఆలిండియా 18వ ర్యాంకు సాధించినట్లు బ్రాంచ్ అడ్మిన్ ప్రిన్సిపాల్ సీహెచ్ అంజిరెడ్డి, అకడమిక్ ప్రిన్సిపాల్ షేక్ షరీఫ్ తెలిపారు. డాబాగార్డెన్స్‌లోని సంస్థ కార్యాలయంలో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో వారు వివరాలు వెల్లడించారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను అభినందించారు.

'కీప్ లెఫ్ట్' సూచికల ఏర్పాటు

మర్రిపాలెం: కంచరపాలెం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రమాదాలను నియంత్రించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. నగర పోలీస్ కమిషనర్ ఎ.రవిశంకర్ ఆదేశాల మేరకు జోన్-2 ట్రాఫిక్ ఏసీపీ జి.రాజీవ్‌కుమార్ ఆధ్వర్యంలో బుధవారం అర్ధరాత్రి దాటాక తాటిచెట్లపాలెం జంక్షన్ వద్ద కీప్ లెఫ్ట్ లెటర్స్, యారో మార్క్ పెయింటింగ్స్ వేశారు. జాతీయ రహదారిపై అందరూ లేన్ డిసిప్లిన్ తప్పక పాటించి, ప్రమాదాలకు గురికాకుండా ఉండాలని ఏసీపీ సూచించారు. చిన్న వాహనాలు ఎడమ వైపు ప్రయాణించాలనే విధంగా పెయింటింగ్‌తో వాహన చోదకులకు సూచించారు. బీఆర్‌టీఎస్ రోడ్డుపై కూడా ఈ ప్రక్రియ మొదలుపెడతామని ట్రాఫిక్ సీఐ మళ్ల అప్పారావు తెలిపారు. కియా షోరూం సీఈవో శ్రీనివాసరావు, మేనేజర్ నరేష్ సౌజన్యంతో పెయింటింగ్స్ సమకూర్చామని సీఐ చెప్పారు. కంచరపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలోని అన్ని ప్రధాన కూడళ్లలో ఈ సూచికలు ఏర్పాటు చేస్తామన్నారు. ట్రాఫిక్ ఎస్ఐ పాపారావు పాల్గొన్నారు.

పర్యావరణ విద్యపై పుస్తకావిష్కరణ


పుస్తకం ఆవిష్కరిస్తున్న మంత్రి అమర్‌నాథ్, రీజినల్ కో-ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి

ఆరిలోవ: పర్యావరణ విద్యపై ఏయూ ఆచార్యుడు డాక్టర్ టి.షారోన్‌రాజు రచించిన పుస్తకాన్ని వర్సిటీలో గురువారం సాయంత్రం జరిగిన ఓ కార్యక్రమంలో మంత్రి గుడివాడ అమర్‌నాథ్, వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి ఆవిష్కరించారు. పర్యావరణ పర్యరక్షణ కోసం అంకిత భావంతో ఈ పుస్తకాన్ని రచించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా రచయితను అభినందించారు.